క్లుప్తంగా

బాల్యవివాహాల నియంత్రణకు కృషి



చిన్నంబావి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ కమిటీ సభ్యుడు నరేందర్ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా బాల్య వివాహాల నిషేధ చట్టం 2006ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు వేధింపులకు గురైతే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరు 1098, 112, 100కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీఓ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలి

వనపర్తి రూరల్: ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ అన్నారు. ఆయన భవన నిర్మాణ కార్మికులతో కలిసి గురువారం కలెక్టరేట్‌లోని లేబర్ ఆఫీస్ వద్ద నిరస తెలిపి అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంటు, ఇటుక, ఐరన్, కంకర, ప్లాస్టిక్ తదితర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో కురుమన్న, బాలస్వామి, శ్రీకాంత్ , సాయిల్, అశోక్, తిరు మలమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సరైన డ్రెయినేజీ లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శ్రీరామాంజనేయ యూత్ సభ్యులు గురువారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వల్ల మురుగు నిల్వ ఉండి ఈగలు, దోమలకు నిలయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.

'ఓయూలో ఆంక్షలు ఎత్తివేయాలి'

అలంపూర్: ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలను నిషేధిస్తూ వైస్ చాన్స్‌లర్ జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. యూనివర్సిటీ ప్రజాస్వామ్య హక్కులను రక్షించాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు తెలిపింది. సమస్యలపై నినదించే శక్తుల గొంతులు నొక్కివేయడం సరికాదన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

పాన్‌గల్: యువతి అదృశ్యమైన ఘటనపై గురువారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్‌కు చెందిన గుంటి రామస్వామి, గోవిందమ్మ కుమార్తె గాయత్రి (24) హైదరాబాద్‌లోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో యువతికి గత నెలలో తల్లిదండ్రులు పెళ్లి సంబంధం కుదిర్చారు. దీంతో గాయత్రి కుటుంబ సభ్యులతో సరిగా మాట్లాడేది కాదన్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో గ్రామంలో, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి గుంటి రామస్వామి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తకోట రూరల్: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కర్నూల్ జిల్లా గూడూరు మండలంలోని మునగాలకు చెందిన ధనుంజయరెడ్డి, బావమరిది వీరారెడ్డి ఈనెల 17న ఒక బైక్‌పై, అదేవిధంగా రంగారెడ్డి, బాల్‌రాజు అనే వ్యక్తులు మరో బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. సాయంత్రం 5గంటల సమయంలో చిలకటోనిపల్లి స్టేజీ సమీపంలోకి రాగానే రంగారెడ్డి నడుపుతున్న బైక్‌ను వెనుక వస్తున్న మరొక బైక్‌పై అతివేగంగా వచ్చిన భరతసింహారెడ్డి బలంగా ఢీకొట్టాడు. దీంతో రంగారెడ్డి, బాలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అదే రోజు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు బాధితులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



దంతనూరులో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



చెన్నారం ఈదమ్మ జాతరలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: ఏదుల ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గురువారం ఆయన రేవల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కొంకలపల్లిలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కొంకలపల్లిలో మొత్తం 331 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని, ఇంకో 23 మందికి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా ఓ మహిళ లేచి తనకు రూ.500 సిలిండర్ రావడం లేదని చెప్పడంతో పాటు ఇదే విషయాన్ని మరో ఐదారుగురు ఇదే విషయం చెప్పారు. శుక్రవారం సాయంత్రం వరకు అర్హులందరికీ రూ.500 సిలిండర్, మిగతా పథకాలు వర్తింపజేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలరాజుకు ఆదేశించారు. రేవల్లి తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం పనులను మంత్రి పొంగులేటి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఏదుల మండలంలోని చెన్నారంలో ఈదమ్మ జాతరలో బండలాగు పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీదేవి, కాంగ్రెస్ ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామనంతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామనంతాపూర్ మోడల్ విలేజ్‌గా ఎంపిక కావడంతో, 70ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందుకు కోసం రూ.3.50కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులు 60మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసులు, పి.ప్రశాంత్, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పేదవాడి సొంతింటి కల

మదనాపురం: పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మదనాపురం మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతనూరుకు 70 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. అనంతరం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, లిఫ్ట్ చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పావని, నాయకులు జగదీష్, శరత్‌రెడ్డి శ్రీనివాసురెడ్డి, మహేష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌ను సుందరీకరిస్తాం



నల్లచెరువు ట్యాంక్‌బండ్‌పై అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: పట్టణ ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేలా నల్లచెరువు ట్యాంకుబండ్‌ని సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని నల్లచెరువు ట్యాంక్ బండ్‌పై మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లచెరువు ట్యాంక్ బండ్ కట్టకు ఇరువైపులా అందమైన ఆర్చ్ నిర్మించాలని, భారీ వాహనాలు వెళ్లకుండా గేటు ఏర్పాటు చేయాలని సూచించారు. నిత్యం వాకింగ్ చేసుకునే వారికి అనుకూలంగా ఉండేందుకు మొక్కలు నాటాలని, ఓపెన్ జిమ్ ప్రదేశంలో ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, అదేవిధంగా సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు వ్యాయామం వాకింగ్ చేసుకునే వారికి అనుకూలంగా చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే వారం పది రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

వసతిగృహ భవనం సందర్శన

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనకాల ఉన్న వసతి గృహ పునరుద్ధరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు వసతి కల్పించేందుకు అనుగుణంగా అన్ని పనులు పూర్తయ్యాయా అని తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ డీఈ సీతారామస్వామి, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు ఉన్నారు.

హమాలీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న బొబ్బిలి నిక్సన్

కొత్తకోట: ఉదయం, రాత్రుళ్లనక నిత్యం రోడ్డుపై హమాలీ పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం బీమా పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. గురువారం హమాలీ సంఘం నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. కార్మికులు తమ జీవనం కోసం వివిధ షాపుల వద్ద బజారు హమాలీలుగా పనిచేస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని స్థితిలో ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కొందరు హమాలీ కార్మికులు మరణించగా.. బాధిత కటుంబం వీధిన పడిన రోజులు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హమాలీ కార్మికుల స్థితిగతులను పరిశీలన చేసి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు కురుమన్న, కోశాధికారి నెల్లూరు కురుమయ్య, వెంకటేష్, పెంటన్న, నరసింహులు, బాలరాజు, బాలస్వామి, రవి, వెంకటస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: పేదలు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గానికి చెందిన 70 మంది లబ్ధిదారులకు రూ. 20.86లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం తన నివాసంలో చిన్నారెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైసింగ్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దేశానికి తలమానికంగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కోళ్ల వెంకటేష్, అబ్దుల్లా, బాబా, రాగి వేణుగోపాల్, పెంటన్న, ఖమ్మర్‌మియా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మదనాపురం: సరళాసాగర్ కాల్వల ద్వారా ఆయకట్టు రైతుల పొలాలకు నీటిని పుష్కలంగా అందించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్‌రాములు డిమాండ్ చేసారు. గురువారం నెల్విడి, నర్సింగాపురం గ్రామాల్లో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. మూడు రోజులకు ఒకసారి సరళాసాగర్ ద్వారా నీటిని వదలడం వల్ల పొట్ట దశకు వచ్చిన వరి పంటలకు తీవ్ర నష్టం వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల మోటార్లకు విద్యుత్ సరిగ్గా అందకపోవడంతో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోటకొండ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్లకు సన్మానం

వనపర్తి విద్యావిభాగం: టీజీపీఎస్‌సీ ద్వారా ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన అధ్యాపకులను ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో వనపర్తి బాలుర కళాశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కవిత, విశ్వేశ్వర్, రెగ్యూలర్ అధ్యాపకులు శిరీష, లావణ్య, రాజీ, భాగ్యవర్ధన్ రెడ్డి, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వీఎస్ శ్రీనివాసులు సీనియర్ అధ్యాపకులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

క్షయ నిర్ధారణపై అవగాహన

పాన్‌గల్: కేతేపల్లిలో గురువారం టీబీ నిర్ధారణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించి, అనుమానితుల నుంచి తెమడ (కళ్లే) సేకరించారు. వ్యాధి సోకిన వారు బయట తిరగడం, ఉమ్మడం చేయరాదన్నారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందని సూచించారు. వ్యాధి సోకిన వారికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారం తీసుకునేందుకు ప్రతి నెల రూ.1000 అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఫిల్టర్ ఇసుక శాంపిల్స్ సేకరణ

గోపాల్‌పేట: ఇటీవల చెన్నూరు వాగులో సీజ్ చేసిన ఫిల్టర్ ఇసుకను గురువారం మైనింగ్ అధికారిణి సురేఖ పరిశీలించారు. గోపాల్‌పేట రెవెన్యూ అధికారులు ఫిల్టర్ చేసిన సుమారు డెబ్బై ట్రిప్పుల ఇసుక ఉంటుందని అంచనా వేయగా.. గురువారం మైనింగ్ అధికారిణి సురేఖ కొలతలు చేసి అంచనా వేశారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ఫిల్టర్ ఇసుక స్లాబులు వేసేందుకు పనికిరాదని, గోడలు కట్టుకునేందుకు, ఇతర అవసరాలకు ఉపయోగపడొచ్చన్నారు. పరీక్షల కోసం ఇసుక శాంపిల్ సేకరించి వనపర్తికి తీసుకువెళ్లారు. శుక్రవారం ఫలితం తెలిసే అవకాశం ఉందని గోపాల్‌పేట తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

పాన్‌గల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన విషయాన్ని హర్షిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, దళిత సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ సీనియర్ నాయకుడు గంధం లక్ష్మయ్య మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమం, ఆత్మ బలిదానాలు, ఎంతో మంది వీరుల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం అని హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణతో ఉద్యోగ, విద్య ఇతర రంగాల్లో మాదిగలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మందకృష్ణ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, శాంతయ్య, స్వామి, రామకృష్ణ, ప్రభాష్, బత్తినిరామకృష్ణ, విష్ణు, రాజేందర్, శివ, జాని, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

వనపర్తి రూరల్: మండలంలోని అప్పాయిపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించి, త్వరగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి, మొక్కలను రెండు పూటల నీరందించాలని, జెర్మినేషన్ సక్రమంగా వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శి నర్మదకి సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మహాధర్నాను విజయవంతం చేయాలి

వనపర్తి రూరల్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 21న జరిగే మహాధర్నాకు భవన నిర్మాణ, హమాలీ, బీడి కార్మికులు భారీగా తరలిరావాలని హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో పట్టణ హమాలీ సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా దశలవారీగా అనేక ఉద్యమాలు నిర్మించినా.. నేటికీ హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, గోవిందు, శివ, అడివన, ఆంజనే యులు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అవగాహన

చిన్నంబావి: ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు ఎంపీడీఓ రమణరావు సూచించారు. వెల్టూరు శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వలసలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో నర్సరీని పరిశీలించారు.

మల్లు స్వరాజ్యానికి నివాళి



వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం, నాయక్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి, పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి, రాజు, వెంకట్‌రాములు, పరమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ ముసుగులో ఘరానా మోసం

పెబ్బేరు రూరల్: అక్రమాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి రూ.లక్షలు దోచుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి గోనెల ఎల్లయ్య, విలేకరిగా పనిచేస్తున్న బొడ్డుపల్లి రాజుపై గురువారం కేసు నమోదు చేసినట్లు పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సర్వే నెంబర్ 369లో తమకు సంబంధం లేని పలు ప్లాట్లపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పలువురికి విక్రయించి మోసం చేసిన వ్యక్తులపై గద్వాల జిల్లా ప్రాంతానికి చెందిన కళ్యాణ్‌కుమార్, తండ్రి నాగిశెట్టి ఫిర్యాదు చేయడంతో పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామన్నారు. భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో.. లేవో క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించుకోవాలని సూచించారు.

గేట్‌లో పాన్‌గల్ విద్యార్థిని ప్రతిభ



ప్రణతి

పాన్‌గల్: గేట్–2025 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముండ్లపాటి బాలరాజు, శ్రీదేవి ఏకైక కుమార్తె ప్రణతి ఆలిండియాలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 32వ ర్యాంక్ (79.07 మార్కులు) సాధించింది. ఎన్ఐటీ నాగ్‌పూర్ బీటెక్ పూర్తి చేసింది. ఉత్తమ ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

న్యూట్రీషన్ కిట్ల పంపిణీ

అమరచింత: జాగ్రత్తలు పాటించి వైద్యులు సూచించిన ఆరోగ్య సలహాలు తీసుకుంటే క్షయ వ్యాధి నుంచి వేగంగా కోలుకునే అవకాశం ఉందని తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫయాజ్ అన్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధిగ్రస్తులకు డీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా అందిస్తున్న న్యూట్రీషన్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓలు సురేష్, విద్యాసాగర్, డాక్టర్ నిస్సార్, డాక్టర్ రూప, డాక్టర్ నిఖిత, సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ చిన్న వెంకట్‌రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వీపనగండ్ల: వేసవిలో ఇతర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఓ శేఖర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జనరల్ ఇంటర్ పరీక్షలు

150 మంది విద్యార్థులు గైర్హాజరు



జిల్లాకేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న డీఐఈఓ ఎర్ర అంజయ్య

వనపర్తి విద్యావిభాగం: జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. శుక్ర, శనివారం ఒకేషనల్, బ్రిడ్జి కోర్స్ పరీక్షలు జరగనున్నట్టు డీఐఈఓ ఎర్ర అంజయ్య తెలిపారు. ఉదయం గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలను సీఎస్, డీఓలతో కలిసి పరిశీలించి ఆయా పరీక్ష కేంద్రాలకు బందోబస్తు నడుమ తరలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రావూస్, అభ్యాస్, జాగృతి జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. చివరిరోజు 5,763 మంది విద్యార్థులకుగాను 5,613 మంది హాజరుకాగా.. 150 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ వివరించారు.

పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలి



పాన్‌గల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, అధికారులు



అమరచింతలో జెడ్పీ పాఠశాలలో..



ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాలలో..

వనపర్తి: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఉదయం 8:30 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. శుక్రవారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 6,853 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్ తదితరులు ఉన్నారు.

■ పాన్‌గల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 210 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో140 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లుగా అజీమ్‌పాషా, విజయలక్ష్మి, డిపార్ట్‌మెంటల్ అధికారులు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

■ ఖిల్లాఘనపురం మండల వ్యాప్తంగా 10 ఉన్నత పాఠశాలలు నుంచి 443 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ జయశంకర్ చెప్పారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 230 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 213 మందిని కేటాయించామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా మునావర్ సుల్తానా, అంజలయ్య, డిపార్టుమెంటల్ అధికారులుగా లక్ష్మారెడ్డి, నర్సింహ్మారావు వ్యవహరిస్తారన్నారు.

■ అమరచింత మండల కేంద్రంలోని జెడ్పీ఼ఉన్నత పాఠశాలలో 150 మంది, డీఎంఆర్ఎం పాఠశాలలో పరీక్ష కేంద్రంలో 103 మంది విద్యార్థులు హాజరవుతారని ఎంఈఓ భాస్కర్ సింగ్ తెలిపారు.